క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు మల్లేశయ్య తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు సమస్యలను వివరించడంతో పాటు మెరుగైన సూచనలు, సలహాలను ఇవ్వడానికి 9063417161 నంబర్‌కు ఫోన్ చేసి వివరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరుటౌన్: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని పటాన్‌చెరు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్‌అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లు జీవిత ధ్రువీకరణ పత్రాన్ని నిర్ణీత గడువులోగా సమర్పించడంలో విఫలమైతే, సర్టిఫికెట్ స్వీకరించి, ప్రాసెస్ చేసే వరకు పెన్షన్ చెల్లింపులు నిలిపివేయడం జరుగుతుందన్నారు. పెన్షనర్లకు ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయానికి రావాలన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల సర్వే



ఇరిగిపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే మండలంలోని ఇరిగిపల్లిలో గురువారం ఎంపీడీఓ యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

జహీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఇమ్రాన్ మొహియొద్దీన్ ఆధ్వర్యంలో నీలం ఆస్పత్రి వైద్యులు ఎండీ నవాజ్‌అలీ, క్యాన్సర్ వైద్యుడు రాజేందర్‌బైశెట్టి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. పేదలకు ఖరీదైన వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు మున్ముందు మరిన్ని నిర్వహించి పేదలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ శివలింగం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతతో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో పునర్నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. గడ్డపోతారం మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి 300 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశంగౌడ్, భోజిరెడ్డి, నరసింహారెడ్డి, రమేష్, లింగం, నర్సింగరావు, మల్లేష్ పాల్గొన్నారు.

16వ రోజుకు చేరిన నిరసనలు



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డుకు ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్యా రానగర్, నల్లవల్లి, గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారంతో దీక్షలు 16వ రోజుకు చేరాయి. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటు విరమిచ్చుకోని లేనియెడల జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

శివరాత్రికి ఆలయం ముస్తాబు

- 25 నుంచి మార్చి 1 వరకు ఉత్సవాలు
- అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం
- సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ

పటాన్‌చెరు టౌన్: ప్రముఖ శైవక్షేత్రం బీరంగూడలోని భ్రమరాంబ మల్లికార్జున ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. కొండల మధ్యలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆలయం ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఐదు రోజుల పాటు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక అలంకరణ, రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం కనువిందు చేస్తోంది. శివుడికి ఇష్టమైన మహాశివ రాత్రి రోజున భక్తులు వేల సంఖ్యలో ఉపవాస దీక్షలతో ఇక్కడికి తరలివస్తారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రవీందర్ రెడ్డి, అమీన్‌పూర్ సీఐ నరేష్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

కార్యక్రమాల వివరాలు..

ఫిబ్రవరి 25 మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ ప్రథమ అర్చకులు ప్రహ్లాద తెలిపారు. ఐదు రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

పటాన్‌చెరు: భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ రవీందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఈఓ శశిధర్ గుప్తా, ఆర్ఐ శ్రీమన్, దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

క్యూలైన్‌లో వెళ్లి దర్శనం

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తాం. భక్తులందరూ సహకరించాలి.



–ఆలయ ఈఓ శశిధర్

సీసీ కెమెరాల పర్యవేక్షణ

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారిని దర్శించుకునేలా చూస్తాం. పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే వాహనాలు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై ఆపకుండా పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.

–పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి

ఏఈఓపై చర్యలు తీసుకోవాలని నిరసన



పురుగుల మందు పట్టుకుని రైతుల ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): రైతుబంధు రాలేదని అడిగినందుకు పురుగుల మందు తాగమన్నా ఏఈఓ మహేందర్‌ను వెంటనే తొలగించాలని కాసాల గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హత్నూర మండల ఏఈఓ మహేందర్‌ను కాసాల రైతులు రైతుబంధు రాలేదని అడిగారు. ఇందుకు మీకు ఒకటే పరిష్కారం పురుగుల మందు తాగండి లేదా పెట్రోల్ పోసుకోండి అని నిర్లక్ష్య సమాధానం చెప్పారని వాపోయారు. ఏఈఓ మహేందర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని రైతులు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఎప్పుడు రైతు బంధువు వస్తుందో ప్రభుత్వం నుంచి వివరణ ఇవ్వాల్సిన ఏఈఓనే రైతులను అధైర్యపరిచేలా మాట్లాడంపై రైతులు తీవ్ర అభ్యంతరం చేశారు. రైతులను ఇబ్బందుల గురిచేస్తున్న ఏఈఓను వెంటనే తొలగించాలన్నారు. పొలాల వద్ద పురుగుల మందు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

అలా అనలేదు..

ఏఈఓ మహేందర్ రైతులను పురుగుల మందు తాగాలని అనలేదని అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. రైతులు కొంతమంది కావాలనే ఇలా పబ్లిసిటీ కోసం చేస్తున్నారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించండి



సద్వార్ హోమ్‌ను సందర్శించిన రమేష్

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

పటాన్‌చెరు టౌన్: సద్వార్ హోమ్‌లోని మహిళల సమస్యలను పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీరంగూడలోని స్వదార్ హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదార్ హోమ్‌లో ఎలాంటి సామాజిక, ఆర్థిక మద్దతు లేని మహిళలకు ఆశ్రయం ఆహారం, దుస్తులు, వైద్య చికిత్స, సంరక్షణ యొక్క ప్రాథమిక అవసరాలు తీర్చాలన్నారు. కేసులో ఉన్న మైనర్ బాలికలకు ఆశ్రయం ఉంటుందన్నారు. అనంతరం వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఐఐసీకి భూపరిశీలన

ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌లో గురువారం ఆర్డీఓ రవీందర్ రెడ్డి పర్యటించారు. సర్వే నంబర్ 27లోని ప్రభుత్వ భూములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పారిశ్రామికవేత్తలు టీఎస్‌ఐఐసీలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించాలని కోరిన నేపథ్యంలో ఆర్డీఓ గ్రామంలో పర్యటించి, భూముల రికార్డులను పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

జహీరాబాద్ టౌన్: మండలంలోని కాశీంపూర్ గ్రామంలో గురువారం ఏపీడీ పూజ పర్యటించారు. గ్రామ పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అలాగే పార్మేషన్ రోడ్డు, నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును బ్యాంక్‌ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఎండలు పెరుగుతున్నందున పని ప్రదేశానికి తాగునీరు తీసుకెళ్లాలని తెలిపారు. ఆమె వెంట ఏపీఓ అశోక్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉన్నారు.



కాశీంపూర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ పూజా

ఎల్‌ఐసీ ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: సంస్థలో నియామకాలు చేపట్టాలని కార్మిక సంఘం పిలుపు మేరకు జహీరాబాద్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ)ఆధ్వర్యంలో గురువారం గంట పాటు సమ్మె నిర్వహించారు. భోజన విరామ సమయంలో ఉద్యోగులు కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐసీఈయూ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అశోక్ మాట్లాడుతూ.. ఎల్‌ఐసీలో క్లాస్ 3, క్లాస 4 నియామకాలు చేపట్టాలని, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘానికి చట్టబద్ధత, గుర్తింపు ఇవ్వాలన్నారు. 1995 నోటిఫికేషన్ ప్రకారం నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. అలాగే, ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎల్‌ఐసీలో 57 జీఓను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని కోరారు. సమ్మెలో సంఘం నాయకులు రాజశేఖర్, మానయ్య, చంటి, సాయిహరి, అశోక్, జమున, మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లను తొలగించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ హుడా మార్గంలో కేవలం ప్రకటనల కోసం ఏర్పాటు చేసిన బస్టాండ్‌లను తొలగించాలని పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పక్కన గతంలో కేవలం ప్రకటనల కోసమే బస్టాండ్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బస్టాండ్‌లను తొలగించి రోడ్డును వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పటాన్‌చెరు: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉ.10.30 గంటల నుంచి సా. 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పటాన్‌చెరు ఏఈ జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐడీఏ– 2 పారిశ్రామిక ప్రాంతం, వాల్యూజోన్ , ఇండస్ట్రియల్ రోడ్డు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బోనాలతో వెళ్తున్న మహిళలు

సంగారెడ్డి టౌన్ : మండలంలోని వకీల్ తండాలో జగదాంబ సేవాలాల్ ఆలయం మొదటి వార్షికోత్సవ వేడుకలు ఆలయ ధర్మకర్త లక్ష్మీబాయి దుల్యానాయక్ సహకారంతో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు డప్పు చప్పుళ్ల ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సోమ్లానాయక్, దుల్యానాయక్, రాంచందర్‌నాయక్, శ్రీను, బిల్యా, రాములు, ప్రభుకుమార్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

వట్‌పల్లి(అందోల్): అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవించిన సంఘటన వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని గొర్రెకల్ గ్రామానికి చెందిన ఉసిరికపల్లి అనితకు గురువారం తెల్లవారుజామున పురటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సకాలంలో అక్కడికి చేరుకొని అనితను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వారిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తల్లి, బిడ్డను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ దేవేందర్, పైలెట్ మల్లేశంకు కృతజ్ఞతలు తెలియజేశారు.



బిడ్డను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ముగ్గురికి రూ.1500, మరో ముగ్గురికి రూ.2000, ఒకరికి రూ.1000 జరిమానా విధించారు. మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ 22న జాబ్ మేళా

జోగిపేట(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 22న రసాయనశాస్త్ర విభాగం, టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో న్యూ ల్యాండ్ ఫార్మా కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు, డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులు జాబ్ మేళాకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళా లో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సి పాల్ కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు 10వ తరగతి, ఇంటర్ మెమోలతో పాటు ఆధార్‌కార్డు, 4 పాస్‌ఫొటోలు వెంట తీసుకురావాలని తెలిపారు.

◆ వైభవంగా శివపార్వతుల కల్యాణం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని తంగడపల్లి గ్రామశివారులో ఉన్న కోటి బిల్వ లింగేశ్వర ఆలయంలో గురువారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. స్వామివారి కల్యాణోత్సవంలో ఆశ్రమ పీఠాధిపతి శివయోగి శివచార్య మహాస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

◆ వైద్య శిబిరానికి విశేష స్పందన

నారాయణఖేడ్: సత్యసాయి మందిరంలో గురువారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి 127 మంది హాజరయ్యారు. శంకర ఆస్పత్రి నేత్ర వైద్యులు, సిబ్బంది కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. 51 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారిలో 48 మందిని శస్త్రచికిత్సల కోసం వాహన సదుపాయం కల్పించి శంకర ఆస్పత్రికి తీసుకెళ్లారు.

◆ సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించండి

సంగారెడ్డి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని దేశ వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు హాజరైన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని పార్లమెంట్లో మాట్లాడిన ఎంపీ డీకే అరుణను గిరిజన సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రాల్లో ఏకైక లంబాడ భాషలో మాట్లాడే జాతి లంబాడాలు మాత్రమేనన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సెలవుదినంగా ప్రకటించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

◆ 24న అర్ధనారీశ్వర విగ్రహప్రతిష్ఠాపన

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారుతండాలో ఈనెల 24న అర్ధనారీశ్వర, జగదాంబమాత, పంచముఖి హనుమాన్, విఘ్నేశ్వరస్వామి, జంటనాగుల ప్రతిమ, నందివిగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు సంగయ్య స్వామి తెలిపారు. బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత్ మహరాజ్, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, అంతర్గామ పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతిమహరాజ్, ముంగి పీఠాధిపతి దేవగిరి మహరాజ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరువుతున్నారని వివరించారు.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

వట్‌పల్లి(అందోల్): ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని కలిగి ఉండటంతో మానసిక ప్రశాంతత పొందుతారని రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతీ అన్నారు. గురువారం అందోల్ మండలంలోని పోతురెడ్డిపల్లిలో శ్రీమంజునాథ ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనగా ఆయన చేతుల మీదుగా యంత్రస్థాపన, మంజునాథ స్వామి పార్వతీ, నందీశ్వర, గణపతి, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ, బలిప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా బంధువులు, గ్రామానికి చెందిన ఆడపడుచులు తల్లిగారింటికి చేరుకోవడంతో గ్రామంలో పెద్ద పండగ వాతావరణం నెలకొంది. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శివరంజని, చేనేత సహకార సంఘం చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ నారాయణ, బాలయ్య, మాజీ సర్పంచులు సంగమేశ్వర్, లింగాగౌడ్, కాళిదాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నూకల పద్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నూకల పద్మారెడ్డి అన్నారు. గురువారం హత్నూర మండలంలోని వివిధ విద్య సంస్థల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల పక్షాన ఎన్నికల ప్రచారం బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సాపూర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి నూకల పద్మారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యను, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో బిజెపి అభ్యర్థులను గెలిపించేందుకు ఎమ్మెల్సీ ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానినికి, విద్యాభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి, బీజేపీ మండల నాయకులు ప్రభాకర్, రాకేష్, మల్లేష్, సాయిరాం, శేఖర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నేటి నుంచి మెథడిస్టు జాతర ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ గ్రామశివారులోని ఈస్టర్ గుట్ట జాతర ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించే 25వ మెథడిస్టు క్రైస్తవ ఉజ్జీవ కూటముల జాతర ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 21న సాయంత్రం ప్రార్థన, హద్నూర్ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి జెండాల ఊరేగింపు ఉంటుంది. రాత్రి 9గంటల నుంచి వాక్య పరిచయం, భజన పోటీలు ఉంటాయి. 22న మధ్యాహ్నం క్వాయర్ బృందంచే ప్రత్యేక పాటలు, వాక్య పరిచయం, జెర్రిరాస్ వాక్య పరిచర్య, దైవ సందేశం, వివిధ గ్రామాల నుంచి వచ్చి వారికి పాటలు పాడే అవకాశం ఉంటుందని నిర్వహకులు తెలిపారు. 23న క్వయర్ బృందంచే ప్రత్యేక పాటలు, ఆరాధన, మధ్యాహ్నం జర్సన్ అబ్రహం గారిచే వాక్య పరిచర్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.